క్లుప్తంగా

గోరంట్ల వేంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు



గుంటూరు రూరల్: గోరంట్ల గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ పౌర్ణమి ప్రత్యేక పూజలు గురువారం నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుదర్శన మూర్తికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలను నిర్వహించారు. సుదర్శన హోమంలో భక్తులు పాల్గొన్నారు. పంచామృతాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు.

నూతన సాంకేతికతతో ఆవిష్కరణలు సాధ్యం



గుంటూరు రూరల్: నూతన సాంకేతికత ద్వారానే ఆవిష్కరణలు సాధ్యమని వీవీఐటీ ప్రొఫెసర్ డాక్టర్ దువ్వూరి రాజేష్ తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళ్ళం ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. అన్ని రంగాల్లో కంప్యూటర్ సైన్స్ మూలాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం కంప్యూటర్ సైన్స్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నాని తెలిపారు. విద్యార్థులు కష్టపడి చదివి, లక్ష్య సాధన దిశగా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ బీఎస్‌బీ రెడ్డి, సీఎస్‌ఈ విభాగాధిపతి డాక్టర్ వి.రాజీవ్‌జట్సన్, డాక్టర్ ఏఎస్ రావు, పి.సుధీర్, సామ్సన్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాలు



తెనాలి టౌన్: బోసు రోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో టీటీడీ, హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సహకారంతో గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్ని నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన వ్రతాల్లో 50మంది దంపతులు పాల్గొన్నారు. అర్చకులు రామలింగంశర్మ సత్యనారాయణస్వామి పూజ, నవగ్రహ పూజ, వ్రత కథను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ధర్మ ప్రచార పరిషత్ జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ అమ్మడు, అన్నమాచార్య వెంకటేశ్వరర సంకీర్తన బృందం పర్యవేక్షణలో కార్యక్రమం జరిపారు.

రక్తదాన ఆవశ్యకత గుర్తించాలి



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు రక్తదాన ఆవశ్యకతను గుర్తించాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఆర్ జ్యోత్స్న కుమారి పేర్కొన్నారు. గురువారం సాంబశివపేటలోని కళాశాలలో ఎన్ఎస్ఎస్, మహిళా సాధికారత విభాగాలతో పాటు రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు ఆధ్వర్యంలో రక్తదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జ్యోత్స్నకుమారి మాట్లాడుతూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. బ్లోసమ్స్ ఆస్పత్రికి చెందిన డాక్టర్ సుష్మా మాట్లాడుతూ రక్తదానం చేయడంలో ఎటువంటి అపోహలు అవసరం లేదని, ఆరోగ్యంగా ప్రతి ఒక్కరు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు కేవీ భాస్కర్ మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో చేపడుతున్న రక్తదాన అవగాహన కార్యక్రమాలను గురించి వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్తలు డాక్టర్ ధాత్రికుమారి, సంతోషికుమారి, సుబ్బరత్నమ్మ, విజయకుమారి, మహిళా సాధికారత విభాగ సమన్వయకర్త డాక్టర్ పి.విజయలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 207 వార్డు సచివాలయాల్లో ఖాళీగా ఉన్న 122 వార్డు వలంటీర్ల పోస్టులను భర్తీ చేయుటకు సెప్టెంబర్ 2న అన్ని వార్డు సచివాలయాల నోటీసు బోర్డుల్లో ఖాళీల వివరాలను ప్రచురిస్తామని నగర కమిషనర్ కీర్తి చేకూరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్డు వలంటీర్ పోస్టుకు దరఖాస్తుదారుడు, 10వ తరగతి/ తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులై , ఆగస్టు 31, 2023 నాటికి 18 సంవత్సరాలు నిండినవారై, 35 సంవత్సరములు మించని వారై ఉండాలన్నారు. దరఖాస్తుదారుని ఆధార్ కార్డు చిరునామా సంబంధిత మున్సిపాలిటీ పరిధికి సంబంధించి ఉండాలన్నారు. సెప్టెంబర్ 3 నుంచి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 7, 8 తేదీల్లో ఆన్‌లైన్‌లో దాఖలైన దరఖాస్తులను పరిశీలించి, 12, 13 తేదీల్లో మౌఖిక పరీక్షలు నిర్వహించి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన వార్డు వలంటీర్లు సెప్టెంబర్ 15 నుంచి విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు.

పారదర్శకంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- బ్రాహ్మణకోడూరులో గడప గడపకు మన ప్రభుత్వం



ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యకు రాఖీ కడుతున్న మహిళ

చేబ్రోలు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతోందని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. పొన్నూరు మండలం బ్రాహ్మణకోడూరు గ్రామ సచివాలయం పరిధిలో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి, ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తూ, స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. ఒక్కో కుటుంబానికి రూ.లక్ష నుంచి అత్యధికంగా రూ.4.5లక్షల వరకు లబ్ధి చేకూరినట్లు లబ్ధిదారులు ఆయనకు చెప్పారు. రాఖీ పండుగ రోజున ఇంటికి వచ్చిన ఎమ్మెల్యేకు మహిళలు రాఖీ కట్టి అభిమానాన్ని చాటుకున్నారు. నుదుట తిలకం దిద్ది, హారతులు పట్టారు. ఈ సందర్భంగా జరిగిన గ్రామ సభలో కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసినట్లు తెలిపారు. ప్రజల ఇంటి ముంగిటకే ప్రతి సంక్షేమ పథకాన్ని అందిస్తున్నామన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకుంటే.. వారిని గుర్తించి న్యాయం చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి ముఖ్యమంత్రి పెద్దపీట వేశారని ఎమ్మెల్యే రోశయ్య పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన కొన్ని సమస్యలను ఆయన అక్కడికక్కడే పరిష్కరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ సాంబశివరావు, పఠాన్ మస్తాన్ షరీఫ్, శ్రీధర్, ఆకుల వెంకటేశ్వరరావు, దాసరి నారాయణరావు, భవనం వంశీరెడ్డి, బొనిగల నాగమల్లేశ్వరరావు, నాగలక్ష్మి, షేక్ మాము, బి.రంగారావు, రుద్రపాటి ఆదిశేషు, అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు తీసుకోవాలి

నిడుముక్కలలో పత్తిపంటను పరిశీలించిన శాస్త్రవేత్త డాక్టర్ శారద



పత్తి పంటను పరిశీలించి, రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: పత్తి పంటలో గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు చేపట్టాలని పత్తి పంట ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఒ.శారద తెలిపారు. గురువారం లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం ఆధ్వర్యంలో తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో పత్తి పంట పర్యవేక్షణ, గులాబీ రంగు పురుగు నివారణపై రైతులకు క్షేత్రస్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలోని పత్తి పంటను పరిశీలించారు. పంట పూత దశలో ఉందని, గులాబి రంగు పురుగు ఉనికిని గుర్తించి, నివారణ చర్యల్లో భాగంగా ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. రోజుకు 8 రెక్కల పురుగులను వరుసగా మూడు రోజులు బుట్టల్లో గుర్తించినట్లయితే గుడ్లపై పనిచేసే వేపగింజల కషాయం 5 శాతం, అజాడిరాక్టిన్ 3000 పీపీఎం, 600 మిల్లీ లీటర్లు గానీ, ప్రొఫెనోపాస్ 40 మిల్లీ లీటర్లు గానీ ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. గుడ్డి పువ్వులను గుర్తించి, వాటిని పీకి నాశనం చేయాలని వివరించారు. పురుగుల ఉధ్రుతి ఎక్కువగా ఉన్నట్లయితే ఎకరానికి 15 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదేవిధంగా పత్తిలో తామర పురుగులను, పచ్చదోమ ఉధ్రుతిని గమనించటం జరిగిందని, వీటి నివారణకు ఫ్రిపోనిల్ 400 మిల్లీ లీటర్లు గానీ, ఫ్లోనికామయిడ్ 60 గ్రాములు కానీ ఎకరానికి తగిన నీటితో కలిపి పిచికారి చేయాలన్నారు. ఎసిఫేట్, మోనోక్రోటోఫాస్ మందులు రైతులు ఎక్కువగా వినియోగిస్తున్నారని చెప్పారు. వీటిని వాడినట్లయితే రసం పీల్చే పురుగు ఉధ్రుతి పెరుగుతుందని చెప్పారు. కాండం పూత విధానాన్ని రైతులకు వివరించారు. ఎల్‌బీజీ 904 రకం మినుము విత్తనాలను రైతులకు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో మంగళగిరి ఏడీఏ శ్రీనివాసరెడ్డి, ఏవో నరశింహులు, వీఏఏ రవి, రైతులు పాల్గొన్నారు.

సమస్యలపై కౌన్సిలర్ల ఏకరువు



అధికారులను ప్రశ్నిస్తున్న వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు రామయ్య, లక్ష్మీలావణ్య, శిరీష



సమావేశానికి అధ్యక్షత వహించిన చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

పనిచేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

తెనాలి అర్బన్: వార్డుల్లో సమస్యలపై పలువురు వైఎస్సార్ సీపీ, టీడీపీ కౌన్సిలర్లు ఏకరువు పెట్టారు. వాటిని పరిష్కరించాలని కోరడంతో పాటు అభివృద్ధి పనులు చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని గురువారం కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ అధ్యక్షతన నిర్వహించారు. ముందు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి, కాంట్రాక్ట్ నియామకాలకు సంబంధించిన ప్యానల్ కమిటీని ప్రకటించారు. ఇందులో వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కొమరబత్తిని జయపాల్, ఆవుల కోటయ్య, తిరుమలశెట్టి సామ్రాజ్యం ఉన్నారు. అనంతరం సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. అజెండాలోని 45వ అంశం చదవడం పూర్తి కాగానే, చైర్‌పర్సన్ ప్యానల్ కమిటీ సభ్యులుగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు అన్నాబత్తుని పద్మజ, పెదలంక లక్ష్మీలావణ్య, షేక్ దుబాయ్ బాబు, పేరం సంజీవరెడ్డిని నియమిస్తున్నట్లు చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ ప్రకటించారు. అనంతరం మిగిలిన నాలుగు అంశాలు చదివి ఆమోదించిన తర్వాత జీరో అవర్ నిర్వహించారు.

- 23,24,25 వార్డుల కౌన్సిలర్లు తోక శిరీష, పెదలంక లక్ష్మీలావణ్య, తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు కాలనీలోని రాజీవ్ గృహకల్పలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని తెలిపారు. వ్యర్థాలు బయటకు వచ్చి దుర్గంధభరితంగా మారిందని, ప్రతిరోజు నివాసితులు తమ ఇళ్లకు వచ్చి ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గత మున్సిపల్ కౌన్సిల్‌లో వెంటనే డ్రైనేజీని పునరుద్ధరిస్తామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే, నేటి వరకు కాంట్రాక్టర్ పనులు చేయలేదని తెలిపారు. కాంట్రాక్టర్‌కు ఇప్పటికే రెండు నోటీసులు ఇచ్చినట్లు మున్సిపల్ ఇంజనీర్ నాగమల్లేశ్వరరావు వివరణ ఇచ్చారు. కాంట్రాక్టర్‌తో పనులు చేయించాలని, లేనిపక్షంలో అతడ్ని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. దీనిపై చైర్‌పర్సన్ ఖాలేదా నసీమ్ కలుగజేసుకున్నారు. పనులు చేయని కాంట్రాక్టర్‌పై చర్యలతో పాటు త్వరగా డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అధికారుల్ని ఆదేశించారు.
- 11వ వార్డు కౌన్సిలర్ కఠారి రత్నకుమారి మాట్లాడుతూ తన వార్డులో మంచినీటి పైపుల నుంచి మురుగు నీరు వస్తోందని, దాన్ని పరిష్కరించాలని కోరారు. మురుగునీరు రాకుండా చర్యలు తీసుకుంటామని ఏఈ చైతన్య హామీ ఇచ్చారు.
- తన వార్డులో బస్టాప్ ఏర్పాటు చేయాలని, లింగారావు ఇంటి సమీపంలో రోడ్లు, కాల్వలు నిర్మించాలని 27వ వార్డు టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ కోరారు. రోడ్లు, కాల్వల ఏర్పాటుకు టెండర్లు పిలిచినట్లు చైర్‌పర్సన్ తెలిపారు.
- సమావేశంలో కౌన్సిలర్లు అన్నం పిన్నారావు, షేక్ ఇస్మాయేల్, ఆవుల కోటయ్య దోమలు, రోడ్లు, కాల్వల సమస్యల్ని ప్రస్తావించారు. వాటిని పరిష్కరిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అనంతరం సమావేశాన్ని ముగించినట్లు చైర్‌పర్సన్ ప్రకటించారు. సమావేశంలో కమిషనర్ ఎం. జశ్వంతరావు, అసిస్టెంట్ కమిషనర్ అనూష, పలువురు మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వకర్మ యోజన పథకానికి ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్



మాట్లాడుతున్న దిలీప్‌రాజా

తెనాలి: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకానికి అర్హత గల చేతి వృత్తిదారులకు కామన్ సర్వీస్ సెంటర్‌తో ఉచితంగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషను చేయించనున్నట్లు సినీ దర్శకుడు, స్వచ్ఛంద సంస్థ ×పెన్నీ మిని స్ట్రీస్¤ వ్యవస్థాపకుడు దిలీప్‌రాజా వెల్లడించారు. స్థానిక రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చేతివృత్తులపై ఆధారపడి జీవించే వారికి ప్రభుత్వం శిక్షణనిస్తుందన్నారు. ఈ సమయంలో రోజుకు రూ.500తో పాటు రూ.15 వేల విలువచేసే పనిముట్లను అందజేస్తుందని తెలిపారు. అనంతరం తొలి విడత రూ.లక్ష (18 నెలలకు తిరిగి చెల్లింపు), రెండో విడత రూ.2 లక్షల (30 నెలలకు తిరిగి చెల్లింపు)ను ఏడాదికి అయిదు శాతం వడ్డీతో రుణం కల్పిస్తుందని చెప్పారు. వడ్రంగి, పడవల తయారీ, కమ్మరి, స్వర్ణకారులు, కుమ్మరి, శిల్పకారులు, చర్మకారులు, చెప్పులు కుట్టేవారు, తాపీ పనిచేసేవారు, బొమ్మల తయారీదారులు, క్షురకులు, రజకులు, దర్జీలు, చేపల వల తయారీదారులకు ఈ పథకం వర్తింస్తుందని ఆయన వివరించారు. ఆసక్తి కలిగినవారు తమ వృత్తి, ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబరు ఫొటోస్టాట్ కాపీలను రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో అందజేయాలని ఆయన కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ఖర్చును తాము భరిస్తామని తెలిపారు. అనంతరం క్యాంప్ నిర్వహించే తేదీని తెలియజేస్తామని చెప్పారు. సమావేశంలో కామన్ సర్వీస్ సెంటర్ ప్రతినిధి దాసరి శివన్నారాయణ, బండ్ల రమణయ్య, అమీర్‌చౌదరి పాల్గొన్నారు.

నేడు 108 పట్టుచీరలతో భ్రమరాంబ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో శ్రావణ మాసం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. పెదకాకాని శివాలయంలో మూడవ శుక్రవారంభ్రమరాంబ అమ్మవారిని 108 పట్టు చీరలతో ప్రత్యేక అలంకరణ చేయనున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు గురువారం తెలిపారు. శ్రావణ మాసంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణల్లో భాగంగా 4వ శుక్రవారం గాజుల అలంకరణ చేయనున్నట్లు చెప్పారు. చివరి శుక్రవారం ముత్తయిదువులు సామూహిక ఉచిత వరలక్ష్మీ వ్రతం నిర్వహహణకు తగిన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పట్టుచీరల అలంకరణలో ఉన్న భ్రమరాంబ అమ్మవారిని దర్శించుకుని, పూజా కార్యక్రమాలలో పాల్గొనాలని ఏసీ శ్రీనివాసరెడ్డి కోరారు. ఆలయ ప్రాకారమండపంలో సహస్ర దీపాలంకరణ సేవ సాయంత్రం కొనసాగుతుందన్నారు. ప్రతి శుక్రవారం సహస్ర దీపాలంకరణ సేవ జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏసీ వెల్లడించారు.

నేటి నుంచి అంగన్‌వాడీల్లో పోషణ మాసోత్సవాలు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని ఐదు మండలాల అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు పోషణ మాసోత్సవాలను నిర్వహించనున్నట్లు సీడీపీవో వి. సుజాతదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, వట్టిచెరుకూరు, గుంటూరు రూరల్ మండలాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రభుత్వం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం పోషణ మాసోత్సవాలను క్రమం తప్పకుండా, కచ్చితంగా నిర్వహించాలని పేర్కొన్నారు. పోషకాహారం ఆవశ్యకతను గర్భిణులకు, బాలింతలకు వివరించేందుకే ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని సీడీపీవో వివరించారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

తెనాలి రూరల్: అనారోగ్య సమస్యలతో ఆత్మహత్యాయత్నం చేసిన ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ నాజరుపేటకు చెందిన ఆటో డ్రైవర్ గండికోట కిశోర్(43) కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల ఆగస్టు 27న గడ్డిమందు కొని తాగాడు. తొలుత కుటుంబ సభ్యులు తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం కిశోర్ మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ కె. చంద్రశేఖర్ తెలిపారు.

65 మందికి ఉచిత వైద్య సేవలు

గుంటూరు మెడికల్: లివర్ సమస్యలను ప్రాథమిక దశలో గుర్తించే ఫైబ్రో స్కాన్‌ను ఉచితంగా 65 మందికి చేశామని కేర్‌వెల్ హాస్పటల్స్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా తెలిపారు. గురువారం స్థానిక గుంటూరువారితోట 7వ లైన్‌లోని కేర్‌వెల్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఒక్కో రోగికి సుమారు రూ. 10 వేల ఖరీదు చేసే ఫైబ్రోస్కాన్ పరీక్షలు ఉచితంగా చేశామన్నారు. రెండేళ్లుగా తమ ఆసుపత్రిలో ప్రతినెలా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి పేదలకు కార్పొరేట్ వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నామన్నారు. త్వరలోనే ఉచిత వైద్య శిబిరం మరోసారి నిర్వహిస్తామని కేర్ వెల్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్ భాష తెలిపారు. వైద్య పరీక్షలు చేయించుకోవాలనుకునే వారు ఈ 8341713713, 9854757999 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

దిశ పీఎస్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

నగరంపాలెం: దిశ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులపై ప్రత్యేక దృష్టిసారించి, త్వరిత గతిన దర్యాప్తు చేయాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ అన్నారు. నగరంపాలెంలోని దిశ పోలీస్ స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించి, పరిశుభ్రంగా ఉంచాలని ఎస్పీ సూచించారు. ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలని చెప్పారు. ప్రతి ఫిర్యాదు తప్పకుండా రిసెప్షన్ రిజిస్ట్రార్‌లో నమోదు చేయడంతోపాటు రశీదులు ఇవ్వాలని అన్నారు. ఎస్పీ వెంట దిశ డీఎస్పీ కేసీహెచ్ రామారావు, ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందరరావు, దిశ పీఎస్ సీఐ శ్రీనివాసరావు, ఎస్‌బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రమణ్యం ఉన్నారు.

విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇండక్షన్ ప్రోగ్రాం



ఎమ్మెల్సీ లక్ష్మణరావును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థి దశలోనే లక్ష్యాన్ని నిర్దేశించుకుని, సాధన దిశగా కృషి చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. నగర శివారులోని లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థులకు గురువారం ఇండక్షన్ ప్రొగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ మాట్లాడుతూ పిల్లల చదువులో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమన్నారు. కమ్యూనికేషన్స్ పెంపొందించుకోవటంలో ఆంగ్ల విద్యపై పట్టు సాధించాలన్నారు. సాంకేతిక నైపుణ్యతలు ఎంతో అవసరమని, నూతన ఆలోచన విధానాలు సమాజాభివృద్ధికి దోహదపడే విధంగా కృషిచేయాలని సూచించారు. చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ తమ కళాశాలను ఎంచుకున్న విద్యార్థులకు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి విద్యార్థికి నైపుణ్యతలతో కూడిన విద్యను అందించి, ఉపాధి కల్పన దిశగా కళాశాల కృషిచేస్తుందని పేర్కొన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ప్రతి నిమిషాన్ని జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ప్రపంచంతో పోటీ పడాలని సూచించారు. ఎమ్మెల్సీని కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

శిక్షణలతో నైపుణ్యాలకు పదును

జీఈసీ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ కోయి సుబ్బారావు, సెక్రటరీ, ప్రిన్సిపల్

యనమదల (ప్రత్తిపాడు): నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకునేందుకు శిక్షణలు దోహదపడతాయని జీఈసీ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు అన్నారు. మండల పరిధిలోని యనమదల గుంటూరు ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం 2023 ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఒరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు యూనివర్శిటీ సిలబస్‌తో పాటు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం, ఇండస్ట్రియల్ శిక్షణల్లో కూడా పాల్గొని, మంచి నైపుణ్యాలు మెరుగుపరుచుకోవాలని సూచించారు. గత సంవత్సరం తమ కళాశాల విద్యార్థులు ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. కళాశాల సెక్రటరీ కోయి శేఖర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యనభ్యశిస్తూ..తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. కళాశాల డైరెక్టర్ గోగినేని సాంబశివరావు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపల్ డాక్టర్ కె. రామకోటయ్య మాట్లాడుతూ ఇంజినీరింగ్ నందు విరివిగా ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. మొదటి సంవత్సరం నుంచే ప్రణాళికాబద్ధంగా విద్యాభ్యాసం చేస్తూ నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

వీవీఐటీలో మూలధన సమీకరణపై సదస్సు



కొత్త సుబ్రమణ్యం, కృష్ణకుమార్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి

పెదకాకాని: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని కుమార్ పంప్స్ వ్యవస్థాపకుడు, చైర్మన్ కొత్త సుబ్రమణ్యం అన్నారు. మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో గురువారం ఇన్‌స్టిట్యూట్ ఇన్నోవేషన్ కౌన్సిల్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో నూతన ఆవిష్కరణలకు పెట్టుబడి, మూలధన సమీకరణలపై ఏంజెల్ ఇన్వెస్ట్‌మెంట్, వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కొత్త సుబ్రమణ్యం మాట్లాడుతూ వినూత్న ఆలోచనతో ముందుకు వెళితే మూల ధన సమీకరణ సులువుగా ఉంటుందన్నారు. నూతన ఆవిష్కరణలకు బ్యాంకులు ఆర్థిక సహకారం అందిస్తున్నాయన్నారు. విద్యార్థి దశలోనే ఆవిష్కరణలు చేపట్టి ఇతరులకు ఉపాధి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కుమార్ పంప్స్ మేనేజింగ్ డైరెక్టర్ కృష్ణకుమార్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచి, చెడు స్పర్శలపై అవగాహన అవసరం



విద్యార్థినులకు అహగాహన కల్పిస్తున్న న్యాయవాది ప్రత్యూష

తెనాలి రూరల్: 18 ఏళ్లలోపు బాలికలు మంచి చెండు స్పర్శలపై అహగాహన కలిగి ఉండాలని న్యాయవాది పేట ప్రత్యూష సూచించారు. స్థానిక కొత్తపేటలోని దొడ్డపనేని ఇందిర బాలికోన్నత పాఠశాలలో గురువారం మంచి, చెడు స్పర్శలపై అహగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కిశోర బాలికలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. యుక్త వయసులో ఉన్న పిల్లలు తీసుకోవాల్సిన పలు జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ప్రత్యూష మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులే కాకుండా తెలిసిన వారు సైతం బాలికలతో చెడుగా ప్రవర్తించే సందర్భాలు ఉంటాయని తెలిపారు. అలాంటి ఘటన ఎదురైతే వెంటనే సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయంలో లేదా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. 18 ఏళ్లలోపు కిశోర బాలికలు దేశభక్తి కలిగి ఉండాలని ఆమె తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పోషకాహారం తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మహిళలకు రక్షణ కవచంగా ఉన్న దిశ యాప్ ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివ బసవమ్మ, వీరాంజనేయులు, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది షేక్ మహబూబ్, విద్యార్థినులు పాల్గొన్నారు,

ముస్లిం మైనార్టీలకు అండగా ఉంటాం



ఎమ్మెల్యే ముస్తఫాకు వినతిపత్రం అందజేస్తున్న సంస్థల ప్రతినిధులు

పట్నంబజారు: ముస్లీం మైనార్టీల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహించే మజ్లీస్ ఉలేమా - జమైతుల్ ఉలేమా సంస్థలు గత 60 సంవత్సరాలుగా విద్య, వైద్యం, చట్ట సామాజిక సేవలు అందిస్తున్నారని, సంస్థకు సొంత కార్యాలయం లేక ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కార్యాలయం ఏర్పాటుకు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా దృష్టి సారించారు. ఈ మేరకు ఆ అంశాన్ని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, నగర కమిషనర్ కీర్తి చేకూరి దృష్టికి తీసుకుని వెళ్లారు. బ్రహ్మానందరెడ్డి స్టేడియం సమీపంలోని రెడ్ ట్యాంక్‌లో ఉన్న 900గజాల స్థలాన్ని ఇచ్చేందుకు మేయర్ మనోహర్‌నాయుడు సుముఖత చూపారు. ఈ విషయంపై త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో కౌన్సిల్ ఆమోదం కోసం మేయర్ కావటి, కమిషనర్ కీర్తి దృష్టికి తీసుకుని వెళ్లాలని సంస్థల ప్రతినిధులు ఎమ్మెల్యే ముస్తఫాను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ముస్తఫా తీర్మానం చేయాలని మేయర్, కమిషనర్‌ను కోరారు. దీనిపై సంస్థల ప్రతినిధులు గురువారం బీఆర్ స్టేడియం సమీపంలోని ఆయన కార్యాయలంలో ఎమ్మెల్యే ముస్తఫాను కలిసి కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.